
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం | 9 | సెప్టెంబర్ | 2025



సోమశిలలో 69.330 టీఎంసీలు

జలాశయంలో సోమవారానికి 69.330 టీఎంసీలు ఉన్నాయి. 21,947 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కండలేరుకు 5 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,11,.500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,030
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,330
నవర (8 గ్రాములు)	రూ.82,648



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 42 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మిగులు పొగాకు కొనుగోలుకు అనుమతులు



వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు: రైతులు అధికంగా, అనధికారికంగా పండించిన పొగాకు అమ్మకానికి భారత వాణిజ్య, పరిశ్రమ లశాఖ అనుమతిచ్చిందని డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ సోమవారం తెలిపారు. పొగాకు బోర్డు అనుమతించిన పరిమితిలో 10 శాతం అధిక ఉత్పత్తి వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సాధారణ సర్వీస్ చార్జీతో, 11 నుంచి 20 శాతం అధిక ఉత్పత్తి వరకు సాధారణ సర్వీస్ చార్జీ (1శాతం)తోపాటు అదనపు సర్వీస్ చార్జ్ 2 శాతం, కిలోకు రూ.1 చొప్పున, 20 శాతం పైన అధిక ఉత్పత్తి అమ్మకానికి సాధారణ సర్వీస్ చార్జీ (1శాతం)తోపాటు అదనపు సర్వీస్ చార్జ్ 3శాతం, కిలోకి రూ 1 అపరాధ రుసుం ఉంటుందని తెలియజేశారు. రైతులు పొగాకు బోర్డును సంప్రదించి ఎంత సరుకు ఉందో తెలియజేస్తూ దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వాణిజ్య సరళిలో పెంచే నారుమడికి అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేని పక్షంలో పొగాకు బోర్డు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

జిల్లా సైన్స్ అధికారిగా శివారెడ్డి

నెల్లూరు (టౌన్): జిల్లా సైన్స్ అధికారిగా శివారెడ్డిని నియమించిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. గతంలో జిల్లా సైన్స్ అధికారిగా పనిచేస్తున్న కరుణాకర్‌రెడ్డికి హెడ్‌మాస్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ తిరుపతి జిల్లా కోట జెడ్పీ హైస్కూల్‌లో పోస్టింగ్ కల్పించారు. దీంతో జిల్లా సైన్స్ అధికారి నియామకానికి తొలుత జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటన ఇచ్చారు. ఈ పోస్టింగ్‌కు ఫిజిక్స్, మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్లు పలువురు పోటీ పడ్డారు. వీరందరిని రిజెక్ట్ చేశారు. రెండో సారి నోటిఫికేషన్ తర్వాత విడవలూరు మండలం రామతీర్థం జెడ్పీ హైస్కూల్‌లో బయాలజికల్ టీచర్ శివారెడ్డిని నియమిస్తూ గత నెల 14న ఉత్తర్వులు వెలువరించారు. శివారెడ్డి నియామకంలో స్థానిక ఎమ్మెల్యే చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. పోస్టింగ్ ఇచ్చిన రోజే హడావుడిగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ విషయం నేటి వరకు మీడియాకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడం గమనార్హం. జిల్లా విద్యాశాఖాధికారులు ఆయన పోస్టింగ్‌పై సమాచారం ఇవ్వకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 27,410 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 9,656 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.39 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

అరుణ, అనుచరులపై న్యాయవాది ఫిర్యాదు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): తన కార్యాలయాన్ని పెట్రోలు పోసి తగుల పెడుతానని నిడిగుంట అరుణ బెదిరించిందని కోవూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది రాజారామ్ సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నిడిగుంట అరుణ ఎస్పీ అని చెప్పుకుంటూ అనేక మందిని బెదిరించి వారి వద్ద డబ్బులు వసూలు చేసేదన్నారు. తాను కోవూరులో నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో అరుణ ఉంటూ అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేదన్నారు. గన్ కల్చర్‌తో అందరినీ బెదిరిస్తోందని, స్థానికులు కూడా ఆరోపిస్తున్నారన్నారు. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్‌పై వచ్చిన సమయంలో కోవూరులోని అరుణ ఫ్లాట్‌లోనే ఉండేవాడని, దీంతో అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనలకు గురయ్యారని, ఇందుకు సంబంధించి అన్నీ ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. తన కార్యాలయాన్ని పెట్రోలు పోసి తగుల పెడుతానని అరుణ బెదించిందని, ఈ విషయమై రెండు నెలల క్రితం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే తన ఫిర్యాదు కోవూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిందని, అయినప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. న్యాయవాది అయిన తనకే న్యాయం జరగకపోతే సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం జరుగుతుందన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు.

కర్షకుడి కన్నీళ్లు.. కూటమి వెక్కిరింతలు



- లేట్ ఖరీఫ్ వరి, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు యూరియాకు అవస్థలు
- బస్తా రూ.600 కావాలంటే పురుగు మందు కొనాలని కండీషన్
- వినియోగం లేదని చేతులెత్తేసిన అధికారులు
- ధాన్యం నిల్వలకు అందుబాటులో లేని గోడౌన్లు
- గత ప్రభుత్వం నిర్మించిన గోడౌన్లనూ గాలికొదిలేసిన పాలకులు
- ధాన్యం ఆరబోతకు ప్లాట్‌ఫారాలు లేని దుస్థితి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నేడు

వ్యవసాయం అనేది ఓ యజ్ఞం. ఆ యజ్ఞకర్త రైతు నేడు అవస్థలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితిని కల్పించింది. ఒక వైపు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందుతుంటే, మరోవైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టాల బారిన పడుతున్నారు. వరితోపాటు కూరగాయలు, పూలు, ఉద్యాన పంటలకు యూరియా అత్యవసరం. అయితే యూరియా కావాలంటే అదీ బ్లాక్ ధరలకు.. కచ్చితంగా పురుగు మందు కొనాలని కండీషన్ పెడుతున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారు. రైతు భరోసాగా ఆర్థిక సాయం ఇచ్చారు. గ్రామాల్లోనే ఆర్బీకేలు ఏర్పాటు చేసి అక్కడే విత్తనాలు, ఎరువులు అందించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించారు. ఆ ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం, గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కిన చరిత్ర లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక అంతకంటే ఎక్కువగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని చెప్పినా మొదటి సంవత్సరం ఎగ్గొట్టింది. రెండో సంవత్సంలో గత ప్రభుత్వంలోని లబ్ధిదారులను తగ్గించి హామీ ఇచ్చిన మేరకు కాకుండా తక్కువ ఇచ్చింది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా వ్యాప్తంగా అన్నదాతల ఆక్రందనలు.. చంద్రబాబు పాలనలో అరణ్య రోదనగా మారింది. విత్తనాలు, ఎరువుల ఇక్కట్లు మొదలు.. పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మొన్నటి వరకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రోడ్డెక్కితే కేసులు పెట్టిన కూటమి ప్రభుత్వం కాదు కాఠిన్య ప్రభుత్వం.. తాజాగా యూరియా కావాలని అడుగుతుంటే రైతులను, ప్రతిపక్షాలను పశువులతో పోల్చిన చరిత్ర చంద్రబాబుకే దక్కుతోంది. ఎరువులు కావాలని రైతులు రోడ్డెక్కకూడదంటూ అధికార దురంహకారాన్ని ప్రదర్శిస్తున్నారు.

విత్తనాలతో రైతుల పోరాటం

వ్యవసాయం ప్రారంభించాలంటే విత్తనాలతోనే రైతుల పోరాటం ప్రారంభమవుతోంది. జిల్లాలో రబీ సీజన్‌లో 9 లక్షల ఎకరాల్లో, ఖరీఫ్ 5 లక్షల ఎకరాల్లో అంటే రెండు సీజన్లకు కలిపి సుమారు 14 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఎకరాకు 25 కేజీల విత్తనాలు అవసరం ఉంది. ఈ ప్రకారం రబీ సీజన్‌లో 9.5 లక్షల ఎకరాలకు సుమారు 22,500 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరం ఉండగా, ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా కేవలం 1000 టన్నులకు మించకుండా సరఫరా చేసినట్లు ఆ శాఖ గణాంకాలే చెబుతున్నా యి. ఈ విత్తనాల కోసం మండల వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. మిగతా 21,500 మెట్రిక్ టన్నుల విత్తనాల కోసం రైతులు ప్రైవేట్ విత్తన వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఖరీఫ్‌కు సంబంధించి 12,500 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరమైతే కేవలం వెయ్యి క్వింటాళ్లలోపే సరఫరా చేసి చేతులు దులుపుకుంది.

ధాన్యానికి గిట్టుబాటు ధరలేక నష్టాల్లో..

జిల్లాలో ప్రధానంగా అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు జరుగుతోంది. సాధారణంగా రబీ సీజన్‌లో 9 లక్షలు, ఖరీఫ్ సీజన్‌లో 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. రబీలో సగటున ఎకరాకు 4 పుట్ల ధాన్యం లెక్కన 30.42 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. ఖరీఫ్‌లో సగటున 3.5 పుట్ల ధాన్యం దిగుబడి వస్తే.. ఈ లెక్కన 14.79 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారానే విక్రయించాలని, అందుకు ఈ-క్రాప్ తప్పనిసరి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే 2019 నాటికి (రబీ సీజన్‌లో) క్వింటా ధాన్యం ఏగ్రేడ్ ధర రూ.1,835 ఉంటే.. పుట్టి ధాన్యం ధర రూ.15,505 ఉంది. 2023-24 నాటికి క్వింటా ధరను రూ.2,320 పెంచారు. అంటే పుట్టి రూ.19,604 పలికింది. అయితే అప్పటి ముఖ్యమంత్రి తీసుకున్న చొరవతో పుట్టి ధాన్యం అన్నదాత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి రూ.24 వేల విక్రయించుకున్నారు.

> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గత ప్రభుత్వం మాదిరిగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయకపోవడంతో రైతుల పాలిట శాపంగా మారితే.. బ్లాక్ మార్కెట్ వ్యాపారుల పాలిట వరంగా మారింది. జిల్లాలో రబీ సీజన్‌లో 9 లక్షల ఎకరాల వరి సాగుకు 1.08 లక్షల మెట్రిక్ టన్నులు, ఖరీఫ్ సీజన్‌లో 5 లక్షల ఎకరాలకు 60 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. అయితే వ్యవసాయశాఖ మాత్రం మా లెక్కల ప్రకారం 49 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని చేతులెత్తేసింది. యూరియా ఒక్కటే కాకుండా మిగతా ఎరువుల పరిస్థితి అంతే. గత రబీ, ఖరీఫ్ సీజన్ల నుంచి రైతులు ఎరువుల కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. రబీ సీజన్‌లో రైతు సేవా కేంద్రాలకు కేటాయించిన ఎరువులను మరో రైతుకు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డదారిలోనే తరలించుకునిపోవడంతో రైతులు బ్లాక్ ధరలకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఎరువులు అవసరమైన సమయంలో యూరియా కొరత పెరిగింది. జిల్లాకు కేటాయించిన యూరియాను అధికారులు ప్రైవేట్ వ్యాపారులకు కేటాయించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అరకొరగా విక్రయించారు.

ఎరువులకు అష్టకష్టాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో ఊరి ముంగిటే సేవలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఏ రోజూ ఇబ్బంది పడలేదు. జిల్లాలో ఏ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో వరి సాగు జరుగుతుందో అంచనాలు వేసి ముందునే విత్తనాలను, అవసరమైన అన్ని ఎరువులను సిద్ధంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించింది. రైతులకు సబ్సిడీ ధరలో అవసరమైన మేరకు ల్యాబ్‌ల్లో టెస్టింగ్ చేసి మరీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) సరఫరా చేశారు. ఆ ప్రభుత్వం పాలనలో ఏనాడు విత్తనాలు, ఎరువలకు రోడ్డెక్కిన చరిత్ర లేదు.

నేడు 'అన్నదాత పోరు'

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి 'అన్నదాత పోరు' నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగే రీతిలో ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

కూటమి వచ్చాక ధరలు పతనం

కూటమి అధికారంలోకి వచ్చాక ధరల పతనంతో రైతులు ఎకరాకు సగటున రూ.26 వేల నుంచి రూ.32 వేల వరకు నష్టపోయారు. ఈ ప్రభుత్వం ధాన్యానికి ఏ మాత్రం మద్దతు ధరను పెంచలేదు. గత ప్రభుత్వంలో ఉన్న ధరలను కొనసాగించింది. ప్రభుత్వ మద్దత ధర ప్రకారం అయితే పుట్టి రూ.19,604 ఉంటే.. దళారులు, మిల్లర్లు కలిసి రూ.16 వేల నుంచి 17,500 లోపలే కొనుగోలు చేశారు. సంవత్సరం.. సంవత్సరానికి ధరలు పెరగాల్సి ఉండగా ప్రభుత్వ పెద్దల నుంచి అధికారులు వరకు మిల్లర్లతో మిలాఖత్ కావడంతో ధరలు దారుణంగా పతనమయ్యాయి. పుట్టి ధాన్యం మీద రైతులు రూ.6,500 నుంచి రూ.8 వేల వరకు నష్టపోయారు. ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధర ను నామమాత్రంగా పెంచింది. ఆ ప్రకారం చూస్తే ఏగ్రేడ్ రకం క్వింటా రూ.2,389. ఈ లెక్కన పుట్టి ధా న్యం రూ.20,187 పలుకుతోంది. ప్రస్తుతం దిగుబడు లు జరుగుతున్న ప్రాంతంలో పుట్టి రూ.15 వేలకు మించి కొనడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

గోడౌన్ల దారిద్ర్యం

జిల్లాలో ఏటా సగటున 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుంటే.. ఆ స్థాయిలో నిల్వ చేసుకునే విధంగా ప్రభుత్వం గోడౌన్ల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. వ్యవసాయశాఖ మార్కెట్ యార్డుల్లో ఉండే అరకొర గోడౌన్లు తప్ప..తెలుదేశం ప్రభుత్వం గతంలో కానీ, ప్రస్తుతం కానీ ఆ ఊసే ఎత్తడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 69 గోడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ఎన్నికల సమాయానికి సగం గోడౌన్లు నిర్మాణం పూర్తికాగా, మిగతా వివిధ దశల్లో ఉన్నాయి. అందులోకి వచ్చిన వాటిని చివరి పనులు పూర్తి చేసి రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

పొగాకు, ఉద్యాన పంటలదీ అదే దారి..

జిల్లాలో పొగాకుతోపాటు ఉద్యాన పంటలైన సపోటా, మామిడి, బత్తాయి, బొప్పాయి ధరలు దారుణంగా పతనమయ్యాయి. పొగాకు వైఎస్సార్‌సీపీ పాలనలో కేజీ రూ.360, ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో రూ.280 అమ్ముకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పొగాకు ధరలను కొనుగోలు దారులు తగ్గిస్తే.. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పోటీ పెంచి ధరలు పెరిగేలా చేసింది. ఇక సపోటా రకం అయితే గతంలో 40 కేజీల బస్తా రూ.1,200 నుంచి రూ.1,300 వరకు విక్రయిస్తే.. అదే బస్తా కూటమి పాలనలో రూ.550 నుంచి రూ.750లకే కొనుగోలు చేస్తున్నారు. మామిడి అయితే గతంలో కేజీ రూ.35ల వరకు పలికితే.. కూటమి వచ్చాక రూ.2లకే పతనమైన విషయం అందరికీ తెలిసిందే. బొప్పాయి కేజీ గతంలో రూ.30ల వరకు ఉంటే.. ప్రస్తుతం రూ.5లకు కూడా కొనే పరిస్థితి లేదు. బత్తాయి మార్కెట్లో కేజీ రూ.30 అమ్ముతుంటే. రైతుల నుంచి రూ.7 నుంచి రూ.9లకే కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో యూరియా అవసరమే లేదా?

జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సంబంధించి 10,300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. జిల్లా అధికారుల లెక్క ప్రకారం ప్రస్తుతానికి 2,471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు సాక్షాత్తు కలెక్టరే చెప్పారు. ప్రస్తుతం మెట్ట మండలాల్లో లేట్ ఖరీఫ్ కింద సుమారు 70 వేల ఎకరాల్లో వరి నాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. ఇక ఉద్యాన శాఖకు సంబంధించి 75,457 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు జరుగుతోంది. వరికి సంబంధించి 8,400 మెట్రిక్ టన్నులు, ఉద్యాన పంటలకు సంబంధించి 1,900 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉంది. అయితే ప్రస్తుతం ఎరువుల కొరత లేదంటూనే అధికధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. ప్రస్తుతం యూరియా బస్తా రూ.266 ధర ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ.500 నుంచి రూ.550 వరకు విక్రయిస్తున్నారు. ఇక రైతు సేవాకేంద్రాల్లో కూడా రూ.290 నుంచి రూ.300లకు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. కొన్ని దుకాణాల్లో అయితే యూరియా కావాలంటే.. కచ్చితంగా పురుగు మందు కొనాలని కండీషన్ పెడుతున్నారు.



జిల్లాలో పొగాకు సాగు

రైతులు	- 3469
పొగాకు బోర్డు అనుమతి సాగు విస్తీర్ణం	- 9931 హెక్టార్లు
రైతులు సాగు చేసిన విస్తీర్ణం	- 9973 హెక్టార్లు
వరి సాగు	
ఖరీఫ్	5 లక్షల ఎకరాలు
లేట్ ఖరీఫ్	70 వేల ఎకరాలు
ఉద్యాన పంటలు	ఎకరాలు
నిమ్మ	28437
మామిడి	25257
బత్తాయి	2782
బొప్పాయి	1179
ఇతర పండ్లు	5402
మొత్తం	63057
పచ్చిమిర్చి	1774
దోసకాయ	619
ఇతర కూరగాయలు	1665
మొత్తం	4059
అయిల్‌పామ్	2571
కొబ్బరి	1483
ఇతర రకాలు	1285
మొత్తం	5339
ఎండుమిర్చి	2020
సుగంధ ద్రవ్యాలు	657
మొత్తం	2677
బంతిపూలు	73
ఇతర పూలతోటలు	253
మొత్తం	326

కోల్డ్ స్టోరేజీల ఊసేలేదు

జిల్లాలో పండ్ల తోటలు 63,057, కూరగాయలు 4,059, పాంటేషన్ 5,339, సుగంధ ద్రవ్యాలు 2,677, పూలతోటలు 326 మొత్తం 75,457 ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలు పండిస్తున్నారు. పొగాకు 9,973 హెక్టార్లు పండిస్తున్నారు. వీటిని నాణ్యత దెబ్బతినకుండా, మార్కెట్ ధరలు పెరిగే వరకు నిల్వ చేసుకునేందుకు జిల్లాలో ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. దీంతో నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు పండించిన పంటలను దళారులు అడిగిన ధరలకే విక్రయించుకుంటూ నష్టపోతున్నారు. వర్షం పడితే రైతు రక్తం చెమటలతో పండించిన పంట క్షణాల్లో మట్టిలో కలుస్తోంది. ఆరబెట్టే ప్లాట్‌ఫారాల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతలపై ఎందుకింత నిర్లక్ష్యం.

ముస్లింలకు చంద్రబాబు ద్రోహం

- ఇమామ్‌లు, మౌజన్‌లకు 11 నెలలుగా గౌరవ వేతనం ఎగనామం
- ద్రోహి అంటూ మైనార్టీలు నినాదాలు
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కాకాణి కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట మౌజన్లు, ఇమామ్‌లతో కలిసి ధర్నా చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి తదితరులు

నెల్లూరు (అర్బన్): అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లుగానే సీఎం చంద్రబాబు ముస్లింలను దగా చేశాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లకు, మౌజన్‌లకు గౌరవ వేతనం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మసీదులను పర్యవేక్షించే, ప్రార్థనలు చేసే మౌజన్‌లకు రూ.5వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించేవారన్నారు. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు గౌరవ వేతనం పెంచుతానని హామీ ఇచ్చాడన్నారు. ప్రతి నెలా మసీదుల పర్యవేక్షణకు మరో రూ.5 వేలు ఇస్తానని తెలిపాడన్నారు. మసీదుల పర్యవేక్షణకు చందాలు ఇచ్చే దాతలు ఇప్పుడు ప్రభుత్వం ఇస్తుందనే ఉద్దేశంతో ఆపేశారన్నారు. అటు దాతలు చందాలు ఇవ్వక, ఇటు ప్రభుత్వం గౌరవ వేతనాలకు, నిర్వహణకు నిధులు విడుదల చేయక మసీదు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మైనార్టీల అభివృద్ధి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాలంలోనే జరిగిందన్నారు. వారికి నాలుగు శాతం రిజర్వేషన్లు రాజశేఖరరెడ్డి కల్పించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దుల్హన్ పథకం కింద పేద ముస్లిం ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక చేయూత అందించారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే దుల్హన్ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వకుండా సీఎం చంద్రబాబు అవమానించారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలు విడుదల చేయాలని లేదంటే వైఎస్సార్‌సీపీ మైనార్టీలకు అండగా ఉండి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక పంపుతానన్నారు. అనంతరం పలువురు మైనార్టీలు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఒకటో తేదీనే గౌరవ వేతనాలు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు వేతనాలు ఇవ్వకుండా ఆపేయడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా మైనార్టీలు పెద్ద ఎత్తున ముస్లింల ద్రోహి చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు ఖలీల్‌అహ్మద్, హంజాహుస్సేని, సిద్ధిఖ్, కరీముల్లా, సమీర్‌ఖాన్, మహబూబ్‌బాషా, మస్తాన్, యజ్దాని, అలీమ్, జిల్లాలోని పలు ప్రాంతాల మౌజన్లు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

11న ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ పరీక్ష

నెల్లూరు (టౌన్): ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌సీఎల్, సీఈసీ, ఒకేషనల్‌ల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ కంపెనీ ఈ నెల 11న ఉద్యోగావకాశాలపై అవగాహన, ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌సీఎల్ టక్‌బీ ప్రతినిధి రాజ్‌కుమార్ 7780323850 నంబరును సంప్రదించాలన్నారు.

సత్వర పరిష్కారం చూపాలంటూ..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- ప్రజల నుంచి 515 అర్జీలు
- టీడీపీ వారు పింఛన్ తీసేయించారని వృద్ధుడి ఆవేదన


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు వినతులు స్వీకరించారు. మొత్తం 515 అర్జీలుందాయి. అధికంగా రెవెన్యూ శాఖవి 221, పోలీస్ శాఖవి 71, మున్సిపల్ శాఖవి 46, సర్వేవి 31, పంచాయతీరాజ్ శాఖవి 41 తదితర శాఖలవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ గంగాభవాని, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

- కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అన్యాయం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల నాగేంద్ర, సుభాన్‌బాషా తెలిపారు. వినతిపత్రమిచ్చిన అనంతరం మాట్లాడుతూ వైకల్య శాతాన్ని తగ్గించడంతో దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారన్నారు.
- ప్రభుత్వం ద్వారా వచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిహారం నగదును కల్లూరు చిన పెంచలయ్య, ఉషా అనే వారు కాజేశారని సజ్జాపురం ప్రాంతానికి చెందిన గురునాథం చందులు వినతిపత్రం సమర్పించారు. పోలీసులు స్టేషన్ చుట్టూ తిప్పుకొంటున్నారని చెప్పారు. వారికి ఫిర్యాదు చేసినందుకు చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు.
- అదనపుకట్నం కోసం భర్త షాహుల్ వేధిస్తున్నాడని కావలికి చెందిన షేక్ రేష్మా వినతిపత్రమిచ్చారు. కలిగిరిలో ఉండే నా అత్తమామలు పట్టించుకోవడం లేదని వాపోయారు. భర్త మద్యం తాగొచ్చి చిత్రహింసలు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం తన తల్లి ఇంట్లో మూడేళ్ల వయసున్న బిడ్డతో ఉంటున్నట్లు చెప్పారు. న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించారు


ఫిర్యాదు చేసిన ముక్కుతిప్ప గ్రామస్తులు

కలువాయి మండలం దాచూరు గ్రామ పంచాయతీలోని ముక్కుతిప్ప గ్రామంలో సర్వే నంబర్ 989, 956లో 56 ఎకరాల మేత పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిమ్మచెట్లు నాటారని పలువురు వినతిపత్రమిచ్చారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ పొలాన్ని పేదలకు పంచాలని చూడగా ముక్కుతిప్ప గ్రామానికి చెందిన కొప్పాల నారయ్య, సుబ్బయ్య, బోరెడ్డి చినపెంచలస్వామి, లక్కాకుల శారదమ్మ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చారన్నారు. ప్రభుత్వం మారగానే ఆక్రమించుకుని నిమ్మ చెట్లు నాటారన్నారు. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్లతో కుమ్మక్కై దొంగ పట్టాలు సృష్టించి, విద్యుత్ సరఫరా, బోర్లు వేసుకున్నారన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూములకు పట్టాలెలా ఇస్తారని ప్రశ్నించారు. పక్కనే ఉన్న 200 ఎకరాలు ఆక్రమించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

హద్దులు చూపాలని వినతి


మాట్లాడుతున్న నిరంజన్, రాధాకృష్ణ

కలువాయి మండలం గోపారం సచివాలయ పరిధిలోని చింతలాత్మకూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32 సీ1లో ఉన్న 4.6 ఎకరాల్లో తమకు సంక్రమించిన భూమికి హద్దులు చూపించాలని ఎస్.నిరంజన్, రాధాకృష్ణ కోరారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పి.శివశంకర్ భార్య వైదేహి ఈ భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. సాగు చేసుకునేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారని చెప్పారు. తహసీల్దార్ హద్దు రాళ్లు వేయించారన్నారు. వాటిని తొలగించినట్లు చెప్పారు. ఎస్సైకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సర్వే చేయించాలని కోరారు.

పింఛన్ రాకుండా అడ్డుకుంటున్నారు

సంవత్సరం నుంచి పింఛన్ రాకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని జలదంకి మండలం కోదండరామాపురానికి చెందిన గోవింద కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు వేరే వాళ్ల భూమిని తన పేరుపై ఎక్కించి పెన్షన్ తీయించేశారని వాపోయారు. నడవలేకపోతున్నాని, పెన్షన్ ఇప్పించాలని కోరారు.

కొండయ్య →



ఉద్యోగాల పేరుతో మోసాలు

- ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉద్యోగం ఇప్పిస్తామని నగదు తీసుకుని మోసం చేశారని పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 109 మంది ఫిర్యాదులు అందజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌సీబీ సీఐ రామారావు, ఎస్‌బీ – 2 సీఐ శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- సంతపేట ప్రాంతానికి చెందిన మాబ్జాన్ అనే మహిళ శివశంకర్, సునయన అనే వారిని పరిచయం చేసి ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.6,56,000 నగదు తీసుకున్నారు. అయితే ఉద్యోగం ఇప్పించలేదని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- నవీన్‌కుమార్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.11 లక్షలు తీసుకుని మోసం చేశాడని కావలి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వినతిపత్రమిచ్చాడు.
- సంగం మండల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా గుంటూరుకు చెందిన సయ్యద్ వారిస్, సాంబశివరావు పరిచయమై కౌన్సెలింగ్ – కెరీర్ డెవలప్‌మెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.36 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశారు. నగదు తిరిగి ఇవ్వడం లేదని నెల్లూరు నగరానికి చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో జలదంకికి చెందిన శివారెడ్డి అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని మోసం చేశాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని ఓజిలి గ్రామానికి చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.
- పొలంలోని వంద టేకు చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికారు. దీనిపై గత నెల 26వ తేదీన పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నిందితులపై చర్యలు తీసుకోవాలని పొదలకూరు మండలం మరుపూరు గ్రామానికి చెందిన కందకట్ల రాజేశ్వరి కోరారు.
- ఓ వ్యక్తి బ్యాంక్ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. రూ.3 లక్షల లిమిట్ ఉన్న క్రెడిట్ కార్డు మంజూరైందని చెప్పాడు. బ్యాంక్ వివరాలు తీసుకుని రూ.1,21,480లు స్వాహా చేశాడని బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- కొడుకు, కోడలు నన్ను పట్టించుకోవడం లేదు. నా ఆస్తిని వినియోగించుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని ఏఎస్‌పేట ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు అర్జీ ఇచ్చాడు.
- నా భర్త నిత్యం మద్యం తాగొచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. కన్నబిడ్డలను పట్టించుకోవడం లేదని నెల్లూరు నగరం వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది.
- నా భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబం గురించి పట్టించుకోవడం లేదు. అత్తమామలు ఆయనకు తోడ్పాటు అందిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాపురాన్ని చక్కదిద్దాలని నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ వినతిపత్రమిచ్చింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కావలి(జలదంకి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. కావలి రైల్వే పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి కావలి ఉదయగిరి బ్రిడ్జికి దక్షిణం వైపున పూరి ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద చెన్నై సెంట్రల్ నుంచి ఒంగోలు వరకు వెళ్లే టికెట్ ఉంది. మృతుడు తెలుగు రంగు చొక్కా, ఆకుపచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నాడు. ఛాతీపై ఆపరేషన్ చేసిన గుర్తు ఉంది. వీపుపై పెద్ద కణిత ఉంది. వయసు 55 నుంచి 60 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి జీఆర్పీ ఎస్సై వెంకట్రావ్ తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

కండలేరులో 42.050 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 42.050 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

తాగునీటి కోసం నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని ఏ కిస్టీపురం పంచాయతీ పరిధిలో ఉన్న చింతలపాళెంలో మూడునెలలుగా తాగునీటి సమస్య ఉంది. దీని గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ సోమవారం గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పాలకవర్గానికి, కార్యదర్శికి, పలువురు అధికారులకు తాగునీటి సమస్యను తెలియజేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు దొరక్క అనేక కుటుంబాలు గ్రామం వదిలి వెళ్లిపోయాయని, మరికొన్ని వలసబాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే అధికార పార్టీకి చెందిన కొందరు బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ రెండు రోజుల్లో బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కరేడు రైతుల భూములు కాపాడతాం

- లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్
- ఇదంతా చినబాబు చేస్తున్న కుట్ర
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఉలవపాడు: ప్రభుత్వం మెడలు వంచి కరేడు రైతుల భూములు కాపాడతామని రిటైర్డ్ ఐఏఎస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కే విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరేడు గ్రామంలో ఆయన రైతన్నతో విజయన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణ చట్ట విరుద్ధమన్నారు. చట్ట ప్రకారం భూమి సేకరించి తర్వాత కంపెనీకి అప్పగించాలన్నారు. కానీ ముందు 8348 ఎకరాల భూమిని మార్చిలో అప్పగించి జూన్‌లో నోటిఫికేషన్ ఇవ్వడమే తప్పన్నారు. ప్రజలను విభజించి పాలించాలనే ఉద్దేశంతో 5 నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. ఇది ప్రభుత్వం చేసే కుట్ర అని అభిప్రాయపడ్డారు. 15 ఏళ్ల పాటు రూ.14,152 కోట్ల రాయితీ ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. కాకినాడ – విశాఖపట్నం మధ్య బీపీసీఎల్‌కు భూ సేకరణ జరిగిన తర్వాత మళ్లీ ఇక్కడ చేవూరులో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. గతంలో ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ నిరాశ్రయులకు కూడా తాను కలెక్టర్‌గా వచ్చిన తర్వాత మేదరమెట్ల వద్ద కాలనీ నిర్మించానన్నారు. కానీ ఇప్పటికీ వారికి న్యాయం జరగలేదన్నారు. పోలీసు శాఖ అత్యుత్సాహం ప్రదర్శించవద్దన్నారు.

ఆలోచన విరమించుకోవాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉంటే ఏం చేసినా చెలామణి అవుతుందన్న ఆలోచన విరమించుకోవాలని, లేకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని కారుచవకగా ఇస్తున్నారని చెప్పారు. రిలయన్స్‌కు 5 లక్షల ఎకరాలు కేటాయించాలని నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిపారు. అది కూడా త్వరలో బయటకు వస్తుందన్నారు. ఉలవపాడు మామిడి తోటలు కూడా ఉండటం వల్ల సుప్రీంకోర్టులో భూ సేకరణ చేయొద్దని కచ్చితమైన తీర్పు వస్తుందన్నారు. అమరావతిలో సాగు భూములు వద్దని చెప్పినా వినకుండా తీసుకొని 11 ఏళ్ల తర్వాత రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. బీపీసీఎల్, ఇండోసోల్ ఏర్పాటు చేయడం వెనుక తెలుగుదేశం ఎంపీ, పెద్ద కాంట్రాక్టర్ ఉన్నారన్నారు. వారికి లాభం చేకూర్చడానికి చినబాబు ప్రజలపై చేస్తున్న కుట్ర అన్నారు. తొలుత రామకృష్ణాపురం, ఉప్పరపాళెం గ్రామాల్లో రైతులను కలిసి మాట్లాడారు. కరేడు బహిరంగ సభలో రైతుల అభిప్రాయాలను స్వీకరించారు. కరేడు భూములను పరిశీలించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, కరేడు ఉద్యమ నాయకులు మిరియం శ్రీనివాసులు, సోషల్ యాక్టివిస్ట్ వసుంధర, సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు, కుమార్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.127	స్కిన్‌లెస్ చికెన్ :	రూ.252
లేయర్	రూ.123		
బ్రాయిలర్ చికెన్:	రూ.230	లేయర్ చికెన్:	రూ.210